వైఎస్సార్‌ సీపీని ఆదరించండి


ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీని ఆశీర్వదించాలని కోరుతున్న ఎమ్మెల్సీ భరత్‌, దుర్గ


వైఎస్సార్‌ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు, యువకులతో ఎమ్మెల్సీ భరత్‌

- కార్యకర్తలు, ప్రజలకు రుణపడి ఉంటాం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ భరత్‌, దుర్గ

రామకుప్పం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పం నియోజక వర్గంలో వైఎస్సార్‌ సీపీని ఆదరించాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్‌, ఆయన సతీమణి దుర్గ కోరారు. మంగళవారం మండలంలోని మిట్టపల్లెలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దివంగత నేత విశ్రాంత ఐఏఎస్‌ అధికారి చంద్రమౌళి కుప్పం నియోజక వర్గంలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీని బలోపేతం చేశారన్నారు. తన తండ్రి బాటలో పయనిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నట్టు భరత్‌ చెప్పారు. గత ఏడాది దసరా పండగ పురస్కరించుకుని శ్రీకారం చుట్టిన జగనన్నతో జనం..కార్యక్రమాన్ని నియోజక వర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి గడప గడపకూ వెళ్లి మహిళలను కలసి, వారి సాదకబాధలు తెలుసుకుంటున్నట్టు భరత్‌ దంపతులు చెప్పారు. మహిళలను తమ ఆడపడుచులుగా భావించి పసుపు, కుంకుమ, చీరను సారెగా ఇస్తున్నామన్నారు. దాదాపు ఆరునెలల కాలంలో 70 వేల మంది మహిళల కలవడం ద్వారా వారి స్థితిగతులను తెలుసుకుని ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ప్రజలతో మమేకమవడం ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రచారంలో ప్రధానంగా సంక్షేమ పథకాల గురించి, ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధి గురించి వివరించామన్నారు. పదేళ్లుగా తమ కుటుంబం కుప్పం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. ఈసారి ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నేతలు చెప్పే వంచక హామీలను ప్రజలు నమ్మరాదన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో మండల వైఎస్సార్‌ సీపీ కన్వీనర్‌ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల పార్టీ కో–కన్వీనర్‌ చంద్రారెడ్డి, టౌన్‌ అధ్యక్షుడు అప్పి, మండల కో ఆప్షన్‌ సభ్యుడు బరకతల్లా, యువజన విభాగం మండల అధ్యక్షుడు యశ్వంత్‌ రెడ్డి, నేతలు మంజునాథ్‌ రెడ్డి, కేశవరెడ్డి, రామిరెడ్డి, ప్రకాష్‌, తజ్‌ముల్‌ పాషా, ఏజస్‌, నయాజ్‌, ప్రకాష్‌ పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

మండలంలోని నెర్నిల్లి, గోవిందపల్లె, రామకుప్పంకు చెందిన టీడీపీ కార్యకర్తలు,యువకులు మంగళవారం మిట్టపల్లెలో ఎమ్మెల్సీ భరత్‌ సమక్షంలో వైఎస్సార్‌ సీపీలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌ సీపీలోకి భరత్‌ ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నవీన్‌, శీను, ఆనంద్‌, ప్రదీప్‌,అమరేష్‌, శ్రీనివాసులు, గంగాధరం, బాలకృష్ణ, చందు, అభి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

శేషవాహనంపై ధ్యానాభిరామస్వామి

బైరెడ్డిపల్లి: మండలంలో కార్వేటికొండపై నిర్వహిస్తున్న శ్రీ ధ్యానాభిరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు శేషవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుత్‌ దీపాలతో అలంకరించిన శేషవాహనంపై సీతా సమేత శ్రీరామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

విగ్రహం ఏర్పాటుకు విరాళం


అయూబ్‌ఖాన్‌కు విరాళం ఇస్తున్న ఫైర్‌ ఆఫీసర్‌ సుబ్బరాజు

పుంగనూరు: దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌ కలామ్‌ విగ్రహం ఏర్పాటుకు ఫైర్‌ ఆఫీసర్‌ సుబ్బరాజు రూ.10 వేల విరాళాన్ని మంగళవారం అబ్దుల్‌ కలామ్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకులు అయూబ్‌ఖాన్‌, టీపీఎస్‌ నాగరాజుకు అందజేశారు. అయూబ్‌ఖాన్‌ మాట్లాడుతూ, అబ్దుల్‌ కలామ్‌ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయిస్తామని మంత్రి డాక్టర్‌ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారని, దాతల విరాళాలతో విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు.

ఏనుగుల దాడిలో చెరకు క్రషర్‌ ధ్వంసం


ధ్వంసమైన క్రషర్‌

సదుం: ఏనుగుల దాడిలో చెరకు గానుగ క్రషర్‌ ధ్వంసమైంది. బాధితుని కథనం...జోగివారి పల్లె పంచాయతీ మారుతివారిపల్లె సమీపంలో సోమవారం రాత్రి ఏనుగులు సంచరించాయి. రైతు లోకనాథకు చెందిన గానుగ క్రషర్‌ను అవి ధ్వంసం చేశాయి. రూ.50 వేల ఆస్తినష్టం కలిగింది. అలాగే పలువురు రైతుల అరటి, చెరకు, వరి పంటలకు స్వల్పంగా నష్టం కలిగించాయి.

ఈఈఎంటి మెరిట్‌ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ


చరణ్‌

పులిచెర్ల(కల్లూరు): ఎడ్యుకేషనల్‌ ఎపిఫనీ మెరిట్‌ టెస్ట్‌ (ఈఈఎంటి)లో పులిచెర్ల హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న పి.చరణ్‌ మండల స్థాయిలో ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో మూడవ స్థానంలో నిలిచినట్లు నిలిచినట్లు ఎంఈఓ తాతయ్య తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి


జగనన్న కాలనీ లబ్ధిదారులతో సర్పంచ్‌ ఇబ్రహీంఖాన్‌

రొంపిచెర్ల: న్యూ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సర్పంచ్‌ ఇబ్రహీంఖాన్‌ కోరారు. మంగళవారం ఆయన జగనన్న కాలనీలో ఇళ్ల పనులను పరిశీలించారు.పంచాయతీలో పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామని, లబ్ధిదారులందరూ త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. వారికి సకాలంలో బిల్లులు మంజూరు చేయాలని హౌసింగ్‌ అధికారులను కోరారు. కార్యక్రమంలో హౌసింగ్‌ ఏఈ యోగానంద్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మస్తానమ్మ, వీఆర్వో వెంకటరమణ, కార్యదర్శి నాగరాజ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డివిజనల్‌ స్థాయి హెచ్‌ఎంల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: డివిజనల్‌ స్థాయి హెచ్‌ఎంల సమావేశం మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, టీచ్‌ టూల్స్‌, టీపీడీ తదితరాలకు సంబంధించిన విషయాలను చర్చించారు. సమావేశంలో పలమనేరు, బంగారుపాళెం, బైరెడ్డి పల్లె, గంగవరం, వీ.కోట మండలాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

21న గాండ్ల ఆత్మీయ సమావేశం

కుప్పం: నియోజకవర్గ గాండ్ల కులస్తుల ఆత్మీయ సమావేశం ఈ నెల 21న బుధవారం నిర్వహిస్తున్నట్టు రెస్కో చైర్మన్‌ సెంథిల్‌ కుమార్‌ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గాండ్ల సామాజిక వర్గం కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి కేటాయించిన 2 ఎకరాల స్థలంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. సమావేశంలో గాండ్ల కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కుష్టు నివారణపై అవగాహన


పాదరక్షలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం పీహెచ్‌సీ సిబ్బంది స్థానిక జెడ్పీ హైస్కూల్లో మంగళవారం కుష్టు వ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి అరుణ్‌కుమార్‌ మాట్లాడారు. కుష్టు సంక్రమించే విధానం, నిర్ధారణ, చికిత్సా పద్ధతులను వివరించారు. పరిసరాల శుభత, చేతుల శుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. తీర్థం పీహెచ్‌సీ పరిధిలోని ఆరుగురికి ఎంసీఆర్‌ పాదరక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి పద్మావతి, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ కాంతమ్మ, డీపీఎంఓ దయానంద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న డీలర్లు, నాయకులు

సదుం: మండల కేంద్రంలో రేషన్‌ డీలర్లు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఐసీడీఎస్‌, ఎండీయూ కమీషన్‌ విడుదల చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్‌ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సర్పంచ్‌ ఉషారాణి, పార్టీ మండల కన్వీనర్‌ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్‌ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, హేమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ సహా కర్ణాటక మద్యం సీజ్‌

- ఒక యువకుడు, మరో బాలుడి అరెస్ట్‌


స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడి అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

పలమనేరు: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.50 వేల విలువజేసే 576 ప్యాకెట్ల మద్యం సహా ఓ మోటార్‌సైకిల్‌ను సీజ్‌ చేసి ఇద్దరిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. మంగళవారం పలమనేరు సీఐ చంద్రశేఖర్‌ తెలిపిన వివరాలు.. స్థానిక రఘువీరారెడ్డి కాలనీలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం అందడంతో పోలీసులు నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో కొత్తపేటకు చెందిన సుందరేష్‌ అలియాస్‌ అజిత్‌(22), మరో బాల నేరస్తుడు మోటార్‌సైకిల్‌పై కర్ణాటక మద్యాన్ని తెచ్చి కాలనీలోని బుజ్జమ్మకు ఇస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. బుజ్జమ్మ అక్కడ నుంచి తప్పించుకుంది. నిందితులు ఒక ట్రిప్పుకు రూ.1000 కూలీగా తీసుకుని ద్విచక్రవాహనాల్లో కర్ణాటక నుంచి మద్యం తెచ్చి బుజ్జమ్మకు ఇస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. పరారీలోని బుజ్జమ్మ, నిందితులకు మద్యం విక్రయిస్తున్న కర్ణాటక వాసి అజయ్‌పై కూడా కేసు నమోదుచేవారు. దాడుల్లో ఎస్‌ఐ సహదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌ రెడ్డి

యాదమరి: మండల పోలీసుస్టేషన్‌ తమిళనాడు సరిహద్దులో ఉన్నందున పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం రాత్రి డీఎస్పీ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా? లేదా అని ఆరా తీశారు. పోలీసు స్టేషన్‌లో క్రైమ్‌ రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌ తమిళనాడు సరిహద్దులో ఉన్నందున పోలీసులు అనుమానం ఉన్న వాహనాలను ఆపి తనిఖీ చేయాలన్నారు. సరిహద్దు గ్రామాల్లో అక్రమంగా మద్యం, సారా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని డీఎస్పీ అడగ్గా స్టేషన్‌కు ఎస్‌ఐ లేరని, సిబ్బంది చాలా తక్కువగా ఉన్నారని తెలిపారు. త్వరలో స్టేషన్‌కు ఎస్‌ఐ వస్తారని, సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. డీఎస్పీ వెంట చిత్తూరు వెస్ట్‌ సీఐ రవిశంకర్‌ రెడ్డి, ఏఎస్‌ఐ ఉమాపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

పశుబీమా పాడి రైతులకు వరం


రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్‌ ప్రభాకర్‌

తవణంపల్లె: పశువుల బీమా పథకం పాడి రైతులకు వరమని పశుసంవర్ధక శాఖ జాయింట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ప్రభాకర్‌ అన్నారు. మంగళవారం మండలంలోని సరకల్లులో ఆంధ్రప్రదేశ్‌ పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్‌ మిషన్‌ ఆధ్వర్యంలో పశుసంతతి పరిశీలనా పథకం కింద సంకరజాతి జెర్సీ పేయదూడల ప్రదర్శన నిర్వహించారు. పేయదూడల ప్రదర్శనను పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జేడీ మాట్లాడుతూ పేయదూడలను ఆరోగ్యంగా పోషించిన పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్‌ హరీఫ్‌ మాట్లాడుతూ, పాలలో వెన్నశాతం పెరగడానికి ఎండుగడ్డి వేయాలన్నారు. మొబైల్‌ వెటర్నరీ అంబులెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీటీపీ డీడీ వాసు, డీడీ మృణాళిక, పశువుల వైద్యాధికారులు డాక్టర్‌ పల్లవి, డాక్టర్‌ లావణ్య, డాక్టర్‌ పిరాకమణి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించరూ!

చిత్తూరు కలెక్టరేట్‌ : వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షులు రాఘవులు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 30 శాతం ఫిట్‌మెంట్‌తో 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, సరెండర్‌ లీవులు మంజూరు చేయాలన్నారు. జీపీఎఫ్‌, ఏపీజీఎల్‌ఐ, మెడికల్‌ రీయింబర్స్‌మెంట్‌ క్లెయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలని, అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్ల సాధన కోసం 14వ తేదీ నుంచి 27వ తేదీ వరకు దశలవారీగా చేయ తలపెట్టిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో నాయకులు రఘు, చెంగలరాయ మండడి, భానుప్రకాష్‌, బాలసుబ్రహ్మణ్యం, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం


వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

వి.కోట: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో నిర్వహించే పరష దుకాణాలకు మంగళవారం పంచాయతీ అధికారులు ఆలయ ప్రాంగణంలో ఈఓ యాదవపతి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వేలంలో రూ.36,500 ఆదాయం చేకూరినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

26న మద్ది చెట్ల వేలం

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ తొప్పనపల్లె వద్ద ఎండిన 17 మద్దిచెట్లను ఈనెల 26న మొరం పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేయనున్నట్టు సర్పంచ్‌ విశ్వనాథ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు పంచాయతీ నిర్దేశించిన ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలియజేశారు.

18న మాతృభాషా పరిరక్షణ సదస్సు

పలమనేరు: పట్టణ సమీపంలోని కళామందిరంలో ఈనెల 18న మాతృభాషా పరిరక్షణ సదస్సు నిర్వహించనున్నట్టు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే కవితల పోటీలో విజేతలను సత్కరిస్తామని, ఈ కార్యక్రమంలో వందమందికి పైగా కవులు, రచయితలు, మాతృభాషాభిమానులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నేడు జేవీవీ సైన్స్‌ కళాజాత

పలమనేరు: పట్టణంలోని గంగమ్మతోపులో బుధవారం సైన్సు కళాజాత నిర్వహిస్తున్నట్టు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గిరిధర్‌మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మ్యాజిక్‌షో, సైన్సు ప్రయోగాలను నిర్వహించి మూఢనమ్మకాలపై ప్రజల్లోని అపోహలను తొలగించే ప్రయత్నం చేయనున్నట్టు తెలియజేశారు.

చౌడేపల్లెలో మండల సమావేశం

చౌడేపల్లె: స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశు తెలిపారు.

టెట్‌, డీఎస్సీ ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లాలోని నిరుద్యోగ ముస్లిం, క్రిస్టియన్‌ మైనారిటీ అభ్యర్థులకు ఉచితంగా టెట్‌, డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు కుట్టి స్టడీ సెంటర్‌ డైరెక్టర్‌ పవన కుమారి మంగళవారం విలేకరులకు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు టెట్‌, డీఎస్సీ ఆన్‌లైన్‌ దరఖాస్తులు, టెట్‌ మార్కుల జాబితా, ఆధార్‌ కార్డు, రేషన్‌ కార్డు, కుల, ఆదాయ ధృవపత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్లు, 4 ఫొటోలు తీసుకుని స్థానిక మిట్టూరులోని తమ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 9491844963, 9490795693 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

‘ఆసరా’తో మహిళల ఆర్థికాభివృద్ధి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీసీ నాగరాజు

వి.కోట: వైఎస్సార్‌ చేయూత పథకంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని వెలుగు సీసీ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్‌ చేయూతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 45 నుంచి 60 ఏళ్ల కలిగిన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు రూ.18,750 ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలనే లక్ష్యంతో వైఎస్సార్‌ చేయూతతోపాటు జీవనోపాధి కోసం మహిళా సంఘాల నుంచి, పొదుపు నుంచి రుణాలు, స్త్రీ నిధి రుణం, అవసరమైన బ్యాంకు రుణాలు రూ. 75,000 వరకు ఇస్తున్నట్టు చెప్పారు. దీనిని సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకెళ్లాలని కోరారు. సీసీలు నాగరాజు, రామకృష్ణ, సంఘమిత్ర తనూజ, చేయూత లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ ఆసరా సభ ఏర్పాట్ల పరిశీలన

పలమనేరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో వైఎస్సార్‌ బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే వెంకటేగౌడ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే విషయమై సమీక్షించారు.

304 మందికి వైద్య పరీక్షలు


సదుంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

సదుం: స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్‌ వైద్యులు 304 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. తొలుత ఈ శిబిరాన్ని ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో నాణ్యమైన వైద్యసేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ పుష్పకుమారి, అన్నపూర్ణ, చరణ్‌, సర్పంచ్‌ ఉషారాణి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్‌ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో 313 మందికి..


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి

పెద్దపంజాణి: మండలంలోని శ్రీరామాపురం జెడ్పీ హైస్కూల్లో మంగళవారం ఎంపీడీఓ అబ్దుల్‌ రహీమ్‌ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. మొత్తం 313 మందికి వైద్యాధికారులు గ్రీష్మాబిందు, టి.మురళి, రెడ్డి షభానా, రాహుల్‌ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, 46 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ చికిత్స కోసం ఒకరిని రెఫర్‌ చేశారు. ముందుగా ఎంపీపీ రెడ్డెప్ప శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సచివాలయాల కన్వీనర్‌ పృథ్వి, సింగిల్‌విండో మాజీ చైర్మన్‌ శంకరప్ప, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జెడ్పీ చైర్మన్‌



తాడేపల్లె క్యాంప్‌ కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డిని జెడ్పీ చైర్మన్‌ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.

– చిత్తూరు కార్పొరేషన్‌

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

–డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి



చిత్తూరు రూరల్‌: ప్రభుత్వ సేవల్లో నిర్లక్ష్యం వహించారాదని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి హెచ్చరించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆరోగ్య కార్యక్రమాలపై అధికారులతో జూమ్‌ కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. కొత్త ఆరోగ్య శ్రీకార్డుల పంపిణీ విధానాన్ని సమీక్షించారు. పీహెచ్‌సీలో ప్రసవించిన తల్లులకు నగదు పంపిణీ, జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం, అడల్ట్‌ బీసీజీ వ్యాక్సినేషన్‌, ఆర్‌సీహెచ్‌ పోర్టల్‌లో గర్భిణి సేవలు, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, ఆస్పత్రి అభివృద్ధి, పల్స్‌ పోలియో నిర్వహణ..ఇత్యాది అంశాలపై చర్చించారు.